దిక్కుతోచడం లేదు ప్రకాశానికి.

అక్షరాలా నలభై ఆరువేల అయిదు వందల ముప్పై తొమ్మిది రూపాయల ఎనభై నాలుగు పైసలు.

ఉత్తరంలో భార్య రాయించిన అంకెలు చూస్తుంటే గుండెలు జారిపోతున్నాయి. అసలే గుంటలు పడ్డ కళ్ళు మరింత లోతుకు పోయాయి. ఆలోచనల సుడిగుండంలో పడి గతం లోతుల్లోకి జారిపోయాడు.

★★★


'అయినా నీ పిచ్చిగానీ, శతమానాలుంటేనే ముత్తైదువా? పసుపుకొమ్ము కట్టుకున్నాగా మావా?! పసుపుకొమ్మే అసలు జయమంట - నీకంతా లాభమే కలుగుద్ది. ఇంకేం ఆలోసించక దైర్నంగా ఎల్లు'

గల్ఫ్ రావాలని నిర్ణయించుకొని బొంబాయి బయల్దేరుతున్నపుడు మంగతాయారు అన్న మాటలివి. పాస్‌పోర్ట్ చేయించుకొని రంగం అంతా సిద్ధం చేసుకునే నాటికి భార్య వంటి మీద శతమానాలతో సహా నగలన్నీ హరించుకు పోయాయి.

కాలికున్న వెండి పట్టాలు విప్పి ఇస్తూ, 'నాన్నా! గల్ఫ్ నుంచి వచ్చేటపుడు నాకు ఎర్రరాళ్ళ నెక్లెస్ తేవాలి' మురిపెంగా అడుగుతున్న కూతురు కళ్ళలోకి సూటిగా చూడలేకపోయాడు.

కళ్ళల్లో పంచరంగుల స్వప్నాలు కదులుతుండగా, జీవితం మీద ఆశలతో, భవిష్యత్తు గురించిన మధురమైన భావనలు చెలరేగుతున్నాయి. ప్రకాశం బొంబాయి చేరుకున్నాడు. సినిమాల్లో చూసిన అరబ్బు షేక్‌లను జ్ఞాపకానికి తెచ్చుకున్నాడు. ఆ వేషంలో తానెలా ఉంటాడో ఊహించుకొని మురిసి పోయాడు.

ఏజెంటు కూడా 'గల్ఫ్ వెళ్ళిన మర్నాటి నుంచీ డబ్బు పోగు చెయ్యడమే నీ



పని? ఇంకవేరే పనేలేదు' అంటూ చమత్కరించాడు.

ప్రస్తుతం ఉండేది పట్నంలోనే అయినా ఏ లోటు లేకుండానే సంసారాన్ని ఈదుకొస్తున్నాడు. పిల్లల్ని చదివించడంలో కూడా లోటేమీ రానివ్వలేదు. తాపీమేస్త్రీగా అంతో ఇంతో మంచి పేరు కూడా సంపాదించుకున్నాడు. చేతిలో డబ్బు నిల్వ మాత్రం కనిపించడం లేదు. ఎన్నాళ్ళీ గానుగెద్దు జీవితం అనుకుంటుండగా పరిచయం అయ్యాడొక పెద్దమనిషి. గల్ఫ్‌కు మనుష్యుల్ని పంపడానికి తాను ఏజెంటునని చెప్పుకున్నాడు. గల్ఫ్ గురించి విన్నాడు గాని, దాని లోతు ఎంతో తెలీదు.

'అందుకే దిగితే తెలుస్తుంది లోతెంతో' అన్నాడు ఏజెంటు. అదిగో - ఆ క్షణం నుంచే గల్ఫ్ జ్వరం పట్టుకుంది ప్రకాశానికి. టైఫాయిడ్ జ్వరానికీ, మలేరియా జ్వరానికీ మందులున్నాయేమో గాని, గల్ఫ్ జ్వరానికి మాత్రం మందేలేదు. ఇంట్లో ఉన్న కొద్దిపాటి డబ్బు, బంగారు వెండి సామాన్లు అమ్మికొనేసరికి తాను బొంబాయి చేరగలిగాడు.

వీసా ఛార్జీలకని, విమానం టికెట్ ఖర్చులకి, మెడికల్ ఎగ్జామినేషన్ ఖర్చులు ఇంకా ఏజెంటు కమీషన్ మొత్తం కలుపుకుంటే నలభై వేల రూపాయలు తేలింది. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేదు. బొంబాయి వెళ్ళేటప్పుడున్న ఉత్సాహం ఊరికి తిరిగి వచ్చేటప్పుడు లేదు.

'ఊరికే దేనికలా కంగారుపడతావు? ముందో పదివేలు చూసి ఇస్తే మెడికల్, వీసా స్టాంపింగ్ అయిపోతాయి. పాస్‌పోర్టు ఫొటో కాపీ చూపిస్తే చాలు - మన ఊళ్లో ఏ మార్వాడీ అయినా నోటు రాయించుకొని సులభంగా అప్పిస్తాడు' అర్జునుడికి కృష్ణుడు గీతాబోధన చేసిన రీతిలో చెప్పాడు ఏజెంటు.

చెప్పినంత సులభంగా పనికాలేదు. భార్య వంటిమీదవి, కూతురు వంటిమీదవి అమ్ముకుంటే పన్నెండు వేలు వచ్చింది. బొంబాయిలో ఖర్చులకని రెండువేలు మినహాయించుకొని మిగిలిన డబ్బు బొంబాయి ఆఫీసులో కడతానని పట్టుకు పోయాడు ఏజెంటు.

పాస్‌పోర్టు ఫొటో కాపీ ఇస్తూ, 'ఇంక నీదే ఆలస్యం. తొందరగా తెములుచ్చుకుని విమానం ఎక్కేస్తే ఇంక డబ్బే డబ్బు' ఊరిస్తున్నట్టుగా చెప్పాడు ఏజెంటు. ప్రకాశానికి పద్మవ్యూహంలో ఇరుక్కున్నట్టు అయింది పరిస్థితి. తన చర్యలను ఇంకోసారి సింహావలోకనం చేసుకున్నాడు. తానేమైనా పొరపాటు చేస్తున్నానా అని ఆలోచించుకున్నాడు. ఎంతలేదు! కాదు!! అనుకున్నా గల్ఫ్ మీది మోజు ప్రకాశాన్ని ముందుకే నెట్టింది.

'ఇవిగో ముప్పైవేలు, వీలైనంత త్వరలో తీర్చాలి. సరేనా? ఏదో తెలిసిన వాడివని సాయం చేస్తున్నాను. వెళ్ళాక మర్చిపోతావేమో. ఎవరైనా వచ్చే వాళ్ళుంటే మంచి సీకో వాచ్ పంపించు. నా కోసమే సుమా! చూస్తాగా - ఎంత విశ్వాసం చూపిస్తావో' డబ్బిస్తూ మార్వాడీ సేట్ చిమన్‌భాయ్ అనే మాటలు చివుక్కున గుచ్చుకున్నాయి. అయినా గల్ఫ్ తిమ్మిరిలో అంత బాధ అనిపించలేదు. ఒక వెర్రినవ్వు మాత్రం నవ్వి ఊరుకున్నాడు. అంతే!

అసలు తాను ఎందుకు విశ్వాసంగా ఉండాలనేది ఇప్పటికీ అర్థంకాని విషయంగానే తోస్తుంది. అయినకాడికి గవర్నమెంటు ఉద్యోగి సంతకం కూడా కావాలన్నాడు. సిగ్గువిడిచి, భార్యని రాయబారానికి పంపి, చేతులు పట్టుకుని బావమరిది చేత సంతకం చేయించాడు. ఇంకా ఎందుకు విశ్వాసంగా ఉండాలో అర్థం కాలేదు.

ముప్పై వేలు ఏజెంటు చేతిలో పోశాడు. ఇవి మెయిన్ ఏజెంట్‌కి బొంబాయిలో కట్టాలి. మరింత ఇంత చేసినందుకు నాకేంటి లాభం? అంటున్న ఏజెంటులో, ఎప్పుడో చూసిన హరిశ్చంద్ర నాటకంలోని నక్షత్రకుడు కనిపించాడు.

గల్ఫ్ వచ్చి తొమ్మిది నెలలు గడిచిపోయాయి. అరబ్‌షేకు జీతం మాట ఎత్తడంలేదు. భోజనానికి మాత్రం ఇస్తున్నాడు. ఇంటి దగ్గర అప్పు వడ్డీ మీద వడ్డీ కలిసి, ఈ నెలకి 'అక్షరాలా! నలభై ఆరువేల అయిదు వందల ముప్పై తొమ్మిది రూపాయల ఎనభై నాలుగు పైసలయింది' అంటూ భార్య రాయించిన ఉత్తరం చదివించుకున్న దగ్గర్నుండీ, కంటి మీద కునుకు లేదు. అరబ్ షేక్ ఇవ్వాల్సిన దానికి వడ్డీ ఉండదు. మార్వాడీ సేట్ చిమన్‌భాయ్‌కి తాను వడ్డీ కట్టాలి' ఈ ప్రహేళికకు సమాధానం అతడికి స్ఫురించడంలేదు.

ప్రకాశం గల్ఫ్ చేరిన నెలరోజుల వరకూ ఊపిరి బిగబట్టి కూచుంది మంగతాయారు. 'ఇంకెంత ఈ రోజో రేపో డబ్బు వస్తుంది. కష్టాలు కడతేరిపోతాయ'ని అనుకుంటుండగానే ఇంకో రెండు నెలలు గడిచిపోయాయి. ఇంట్లో వెచ్చాలు నిండుకున్నాయి. కొట్లో సామాన్లకి అరువు అడిగితే-

'నీకేందమ్మా! మీ మొగాయన బయటి దేశంలో ఉండె. నువ్వే మాకు సాయం జేయాల గాని, నీకు అరువేందమ్మా' శెట్టి సరుకులు ఇస్తూ అన్న మాటలు వెటకారమో, పొగడ్తో అర్థం కాలేదు. శెట్టి కొట్లో ఖాతా ప్రతి నెలా పాపం పెరిగినట్టు పెరుగుతోంది.

స్కూలు ఫీజులు కట్టలేని అశక్తత పిల్లల చదువులు మానిపించింది. తప్పనిసరి పరిస్థితులు. నాలుగు పక్కల నుంచీ వస్తున్న ఆర్థిక వత్తిడులు. చివరికి మంగతాయారును మంగిగా మార్చాయి. పనిమనిషిగా పదిమంది ఇళ్ళల్లో పనిచేయడం, వాళ్ళు విదిల్చే చద్దన్నాలు తినడం అలవాటు చేసుకుంది. మార్వాడీ సేట్ కనీసం వడ్డీ అయినా కట్టమంటూ చేస్తున్న వత్తిడి, తమ్ముడి నిష్ఠూరాలు భరించలేక ప్రకాశానికి చెప్పుకుంది.

'ఇదిగో పంపుతున్నా! అదిగో పంపుతున్నా!' అంటూండగానే తొమ్మిదినెలలు గడిచిపోయాయి. వచ్చీరాని అరబ్బీలో 'అయ్యా! నా పరిస్థితి చాలా హీనంగా ఉంది. ఏదైనా దారి చూపండి' అంటూ అరబ్ షేక్‌ని వేడుకున్నాడు. ఏనాడూ ఒకరి ముందు చేయిచాపని ప్రకాశం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రావలసిన జీతం ఏడువేల రెండు వందల్లోనూ, తిండి ఖర్చులకుగాను ఇచ్చిన పన్నెండు వందలూ మినహాయించుకున్నాడు. అక్షరాలా ఆరువేల రియాల్స్ ప్రకాశం చేతిలో పెట్టాడు. ఏనుగెక్కినంత సంబరం అయింది ప్రకాశానికి.

సరిగా ఆ

# అరేబియా చేప

—సంపర శ్రీనివాసరావు

సమయానికే 'గంధం త్రినాథమూర్తి' బరిలోకి దిగాడు. అతన్ని అందరూ జి.టి.మూర్తి అంటుంటారు. ఎటువంటి వాళ్ళనైనా మాటల ద్వారా బుట్టలో వెయ్యడం వెన్నతోపెట్టిన విద్య అతనికి.

'ప్రకాశం! నీదీ నాదీ ఒకటే కులం. మనందరం ఇక్కడ కలిసికట్టుగా ఉండాలి. ఒకళ్ళకొకళ్ళు సాయం చేసుకుంటూ' అంటూ, అతడితో బీరకాయ పీచు చుట్టరికం కూడా కలిపేసుకున్నాడు. రామేశ్వరం పోయినా శనీశ్వరం వదల్లేదట. సముద్రాలు దాటి వచ్చినా, వీళ్ళు కులం కంపును మాత్రం వదిలించుకోలేక పోయారు.

ప్రకాశం చేతిలో డబ్బున్న సంగతి జి.టి.మూర్తికి తెలిసింది. 'ఇదిగో ప్రకాశం - నా మాట విను. అంతంత డబ్బు చేతిలో పెట్టుకుని ఉండడం అంత మంచిది కాదు. నన్నడిగితే వెంటనే డ్రాఫ్ట్ తీయించి ఇంటికి పంపించెయ్యమంటాను. ఏమంటావ్?' అంటూ అడక్కుండానే సలహా ఇచ్చాడు. కావాలంటే ఎకౌంట్ నెంబర్ చెప్తే డ్రాఫ్ట్ తానే చేయిస్తానన్నాడు. జి.టి.కి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో అర్థంకాక ఉక్కిరిబిక్కిరయ్యాడు ప్రకాశం.

భార్య మంగతాయారు అకౌంట్ నెంబరు ఇచ్చాడు మూర్తికి.

'పద! ఇక్కడికి దగ్గరే బ్యాంకు. నీకేమో చదవడం రాయడం రాదాయె. మాకు తప్పదుగా మరి' అంటూనే బయల్దేరదీశాడు. ఇంగ్లీషు అక్షరాలను, అంకెలను చూసి యథాతథంగా రాయగలిగిన పాండిత్యం మూర్తికి ఉంది. అందుకే ఏ చెట్టూ లేని చోట ఆముదం చెట్టే మహావృక్షమన్నట్టు - గొప్ప చదువుకున్న వాడిగా పేరుంది మూర్తికి, వాళ్ళ మనుషుల్లో.

డ్రాఫ్ట్ చేయించాక 'డ్రాఫ్ట్ అయితే తయారయింది. ఇంక దీన్ని ఇంటికి పంపే ఏర్పాట్లు చూసుకో' అన్నాడు మూర్తి.

'ఇంత చేసినోడివి అది కూడా నువ్వే చెయ్యరాదా?' ప్రాధేయపడ్డాడు ప్రకాశం.

'డ్రాఫ్ట్ ఇటు నుంచి ఇటే రిజిస్టర్ చేసేద్దాం. ఆలస్యం వద్దు' అంటూ పోస్టాఫీసుకు తీసుకెళ్ళాడు. కవరు మీద అడ్రసు కూడా తానే రాసి, రిజిస్టరు చేయించాడు మూర్తి.

ఇంత సహాయం చేసిన మూర్తికి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీలేదు. అట్నుంచి హోటల్‌కి వెళ్ళి ప్రకాశం ఖర్చుల మీదే కడుపు నిండా భోజనం లాగించి సెలవు పుచ్చుకున్నాడు మూర్తి. అప్పట్నించి ఎదురుచూపులు మొదలయ్యాయి ప్రకాశానికి 'భార్య జవాబు కోసం'.

నెల దాటింది. రెండో నెల వెళ్ళి మూడో నెల కూడా గడిచిపోయింది. భార్య నుంచి కబురూ కాకరకాయా లేదు.

'మార్వాడీకి అసలూ, వడ్డీ తీర్చెయ్యగా ఇంకా మూడు వేల నాలుగు వందల చిల్లర మిగులుతుంది. జాగ్రత్తగా ఖర్చు చేసుకుంటూ పొదుపుగా ఉండు' అని ఉత్తరం కూడా రాసాడాయె. నాలుగోనెల చివర్లో డ్రాఫ్ట్ లాంటిదేదీ రాలేదని భార్య నుంచి వచ్చిన కబురు చూసి హతాశుడయ్యాడు. బ్యాంకుకు వెళ్ళి విచారించాడు.

'ఈ నెంబరు డ్రాఫ్ట్ ఎప్పుడో కేష్ అయిపోయిందయ్యా! ఇంకా ఇప్పటిదాకానా?' అన్నారు.

పగలే చుక్కలు కనిపించాయి ప్రకాశానికి. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. 'డబ్బు ఏమై పోయినట్లు చెప్మా?' అని ఆలోచనలో పడ్డాడు. 'మంగ డబ్బు వాడుకొని అందలేదని చెప్పే బాపతు కాదే. మరి ఎక్కడ జరిగింది లోపం' అని తర్కించుకున్నాడు. సమయానికి ఊళ్ళో మూర్తి కూడా లేడాయె. వేరే ఊర్లో ఎక్కడికో వెళ్ళిపోయాడట. ఊరి పేరు కూడా సరిగా తెలియదాయె.

తెలిసిన వాళ్ళందరి కాళ్ళూ గడ్డాలూ పట్టుకొని బ్యాంకులో విచారించగా తేలిందేమిటంటే-

'ప్రకాశం చదువురానితనాన్ని అవకాశం చేసుకొని, మూర్తి చక్కగా మోసం చేశాడు. డ్రాఫ్ట్ తన పేరున చేయించుకొని, తన ఇంటి అడ్రస్‌కు ప్రకాశం డబ్బుతోనే రిజిస్టర్ చేసుకున్న ఘనుడు జి.టి.మూర్తి. సంగతి తెలిసి ప్రకాశం నోట మాట రాలేదు.

మూర్తి మోసం చేసాడని నిరూపించే ఆధారమూ లేదు. ప్రకాశానికి న్యాయం జరిగే మార్గమూ లేదు. అంత పకడ్బందీ ప్రణాళికతో డబ్బు చేజిక్కించుకున్నాడు మూర్తి. సంవత్సర కష్టాన్ని సునాయాసంగా దోచేసుకున్నాడు.

ఇంత చెప్పాక, ఈ ఒక్క సంగతీ చెప్పినందువల్ల నా సొమ్మేమీ పోదు. చెప్పనందువల్ల పాఠకులకు కలిగే నష్టమూ లేదు. అయినా చెప్పడం నా ధర్మంగా భావించి చెబుతున్నాను.

ప్రకాశం కుటుంబం ఏమైందీ - యదార్థంగా నాకు తెలియదు. అయితే,

'చూడు నారాయణా! నీదీ నాదీ ఒకటే కులం. మనం ఒకళ్ళ కొకళ్ళు సాయం చేసుకోబోతే ఎవరు చేస్తారు చెప్పు?' తన వలకు తగిలిన మరొక చేప నారాయణతో బ్యాంకుకు వెడుతూ మూర్తి చెబుతున్న మాటలకి, నారాయణ కళ్ళు చెమర్చాయి.

★